సోమవారం 12, జూన్ 2023 5 అనంతపురం

ప్రజా రక్షణలో సీసీ కెమెరాలు కీలకం : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో ప్రజా రక్షణకు సీసీ కెమెరాలు చాలా కీలకంగా పనిచేస్తాయని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. ఆదివారం నగరంలోని 44వ డివిజన్ పరిధిలో 3వరోడ్డు 11వ స్ట్రీట్‌లో స్థానికులు ఏర్పాటు చేసిన ఐదు సీసీ కెమెరాలను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కాకుండా స్థానికులే ముందస్తు జాగ్రత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కెమెరాలు ఏర్పాటు చేసిన స్థానికులతోపాటు త్రీటౌన్ ఎఎస్ఐ రాజాప్రసాద్, అడ్వకేట్ వహీదుల్లాఖాన్‌ను మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి సుధా, ఇషాక్, కమల్ భూషణ్, కో ఆప్షన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి, సచివాలయం కన్వీనర్ నస్రీన్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాలరంగయ్య

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి - ఉరవకొండ

కౌలురైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య డిమాండ్ చేశారు. ఉరవకొండలోని సిపిఎం కార్యాలయంలో కౌలు రైతుల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి, బాలరంగయ్య మాట్లాడుతూ కౌలురైతుల సమస్యలు పరిష్కరించకపోతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పుట్టగతులుండవని విమర్శించారు. రాష్ట్రంలో నూటికి 70 శాతం మంది కౌలు రైతులు వ్యవసాం చేస్తున్నారన్నారు. 32 లక్షల కుటుంబాలు కౌలు వ్యవసాయంపై ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నాయన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టడంతో వ్యవసాయం పూర్తిగా నష్టాలు రావడంతో భూ యజమానులు వ్యవసాయాన్ని వదిలి ఇతర వృత్తులు చేసుకోవడానికి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారన్నారు. ఈ నేపథ్యంలో రోజువారి కూలి చేసుకునే బడుగు బలహీన వర్గాల ప్రజలు, దళితులు, ఇతర పేదలు భూస్వాముల భూములను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారన్నారు. వీరు వేలాది రూపాయలు అప్పులు చేసి ముందస్తుగా కౌలుకు చెల్లించి పెట్టుబడులు పెట్టి పంటసాగు చేస్తే పకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోయినప్పుడు ప్రభుత్వాలు కౌలు రైతుల ఆదుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కౌలు రైతులకు 2019 పంట సాగు దారుల చట్టం(సిసిఆర్‌సి) ప్రకారం గుర్తింపు కార్డు మంజూరుకు భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో చట్టంలో మార్పులు చేసి కౌలు రైతుకు సులభంగా గుర్తింపు కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపుకార్డు జారీలో భూ యజమాని సంతకం తొలగింపు సాధనే లక్ష్యంగా కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జూన్ 5 నుండి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార జాతాలు, సచివాలయ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించామన్నారు. పంటరుణాలు, రాయితీ ఎరువులు, విత్తనాలు, పంటనష్టపోతే పరిహారం దక్కక కౌలు రైతులకు అడుగడుగునా కష్టాలసాగు తప్పడం లేదని అన్నారు. భూ యజమాని సంతకంతో పని లేకుండా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సంయుక్తంగా గ్రామ సభలు నిర్వహించి అసలైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, ఇతర రాయితీలు ఇచ్చి వారికి అమ్ముకునేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. పకతి వైపరీత్యాలతో పంట నష్టం వాటిల్లితే పరిహార సౌకర్యం కల్పించి కౌలు రైతుల ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం సోమవారం విజయవాడ నుండి ప్రకాశం బ్యారేజీ మీదుగా మంగళగిరి సిసిఎల్ఎ కార్యాలయం వరకు నిర్వహించే రాయభార పాదయాత్ర కార్యక్రమంలో కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు సీనప్ప, కౌలు రైతు సంఘం మండల నాయకులు మురళి, రవికుమార్, మంజునాథ్, కృష్ణ, బంగారు నాయుడు, జయరాములు,రుద్రతో పాటు కౌలురైతులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దారిదోపిడీ దొంగలు..?

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో శనివారం రాత్రి దారిదోపిడీ చేసే నిందితులను అరెస్టు చేసినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొంతమంది యువకులు ఒక ముఠాగా ఏర్పడి శనివారం రాత్రి 11 గంటలకు సమయంలో కళ్యాణదుర్గం నుంచి శాతవాహన ఫ్యాక్టరీకి వెళ్తున్న ఒక లారీని అడ్డగించి డ్రైవర్, క్లీనర్‌ని పట్టుకుని వేధిస్తుండగా అటుగా వెళ్తున్న కొంతమంది వ్యక్తులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన స్థానిక పోలీసులు పక్క గ్రామాలకు చెందిన కొంతమంది యువకులతో కలిసి నిందితులను చుట్టుముట్టారు. అయితే వీరిలో అందరూ తప్పించుకోగా ఇద్దరిని మాత్రం అదుపులో తీసుకున్నట్లు తెలుస్తోంది. వారి నుంచి వివరాలు సేకరించగా దారి దోపిడీ చేసే ముఠాలో 18 మంది ఉన్నట్లు పోలీసులకు సమాచరాం ఇచ్చినట్లు తెలుస్తోంది. వీరి రెండు మాసాల నుంచి ప్రధాన రహదారిపై వెళ్లే వాహనాలను ఆపి వారి నుంచి డబ్బులు దోచుకోవడంతోపాటు సాయిబాబా ఆలయంలో కొన్ని ఆభరణాలకు కూడా అపహరించినట్లు సమాచారం. ఆఖరికి వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ స్టార్టర్లు, విద్యుత్ మోటార్లు, కేబుల్ వైర్లను కూడా చోరీ చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ బళ్లారి చెందిన నలుగురు, ఉద్దేహాల్‌కు చెందిన 8 మంది యువకులు, పక్క గ్రామాల చెందిన కొంతమంది ముఠాగా ఏర్పడి చేస్తున్నట్లు సమాచారం. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. అయితే బొమ్మనహాల్‌కు ఎస్ఐ లేకపోవడంతో రాయదుర్గం సిఐ యుగంధర్‌ను వివరణ కోరగా త్వరలో పూర్తి సమాచారాన్ని తెలియజేస్తామన్నారు.

నేటి నుంచి పాఠశాలలు పున:ప్రారంభం

కొత్తచెరువు : వేసవి సెలవుల అనంతరం జూన్ 12వ తేదీ(సోమవారం) శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు పున:ప్రారంభమవుతాయని సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి డిఇఓ రంగస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఒంటి పూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. 12 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 7:30 నుంచి 11:30 గంటల వరకూ తరగతులు నిర్వహించాలన్నారు. తర్వాత విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయాలని తెలిపారు.

లేని కేటాయింపులు

హెచ్ఎన్ఎస్ఎస్ వెడల్పు తరువాతే శింగనమల చెరువులకు నీరు

ఇప్పటి సిస్టమ్‌లో నీరు సాధ్యమయ్యేనా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల నియోజకవర్గం పరిధిలో 45 చెరువులకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. ఆయనకు రుణపడి ఉంటాం.' అని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఇటీవల ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్వర్వులను మీడియాకు అందజేశారు. అయితే ఆచరణలో దీని అమలు ఏ మేరకు సాధ్యమవుతుందన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. లేని నీటి కేటాయింపులతో ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఆధునీకరణ తరువాతే 45 చెరువులకు నీరు

హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యం ప్రస్తుతం రెండు వేల క్యూసెక్కుల్లోపే ఉంది. కర్నూలు, అనంతపురం, చిత్తూరు మూడు జిల్లాలకు కలిపి ఇప్పుడు హంద్రీనీవా ద్వారా వస్తున్న నీరు సగటున 30 టిఎంసిలకు మించి రావడం లేదు. వీటితోనే గుంతకల్లు, నియోజకవర్గం పరిధిలోనూ, రాప్తాడు, ధర్మవరం, పెనుకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల పరిధిలోనే చెరువులకు నీరిస్తున్నారు. మిడ్‌పెన్నార్‌కు హంద్రీనీవా నుంచి నీరు ఇప్పటి వరకు ఇవ్వలేదు. జిల్లా అవసరాలకు నీరు సరిపడటం లేదు. ప్రవాహ సామర్థ్యాన్ని పెంచాలని జిల్లా నేతల కోరిక మేరకు ప్రభుత్వం 2020లో కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు ఈ పనులేవీ ప్రారంభం కాలేదు. ప్రారంభమైనా ఎప్పటికి పూర్తవుతాయో తెలియదు. అలాంటప్పుడు ప్రభుత్వం ఇచ్చిన కొత్త గెజిట్‌లో 6300 క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చాకనే ఈ నియోజకవర్గంలోని 45 చెరువులకు నీరిచ్చే విధంగా స్పష్టంగా పేర్కొన్నారు.

దక్షిణ కాలువ ద్వారా 18 టిఎంసిలు ఎలా సాధ్యం

శింగనమల నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా సాగునీటిని అందించే కాలువ మిడ్ పెన్నార్ దక్షిణ కాలువ. నియోజకవర్గం పరిధిలో గార్లదిన్నెలో మొదలై యల్లనూరు, పుట్లూరు వరకు నీటిని అందించే మిడ్ పెన్నార్ దక్షిణ కాలువ 96.56 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఈ కాలువ ప్రవాహ సామర్థ్యం 1342 క్యూసెక్కులు. ఇప్పటికే మిడ్‌పెన్నార్ నుంచి 4.320 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. అయితే 2.88 టిఎంసిలకు మించి నీటిని విడుదల చేయలేకపోతున్నారు. కాలువ ఆధునీకరణ పనులు ప్రారంభమై మధ్యలోనే ఆగిపోయాయి. ఇలాంటికాలువ ద్వారానే అదనంగా 45 చెరువుల్లో 25 చెరువులకు నేరుగా నీటిని అందివ్వాల్సి ఉంది.

ఇది వరకేవున్న కేటాయింపులకు సంబంధించిన నీరే పూర్తి స్థాయిలో అందివ్వలేకుండా ఉంటే ఇప్పుడు కొత్తగా జరిగిన కేటాయింపుల ద్వారా నీరు ఇవ్వడం సాధ్యమవుతుందా అన్న సందేహాలున్నాయి. ఇవి కాకుండా తాడిపత్రి బ్రాంచ్ కాలువ ద్వారా కూడా చెరువులకు నీరివ్వాలని నిర్ణయించారు. ఇది మరింత చర్చనీయాంశంగా మారింది. దశాబ్దకాలంగా తాడిపత్రి బ్రాంచ్ కాలువకు నీరే ఇవ్వడం లేదు. రెండు సంవత్సరాలుగా పుష్కలంగా నీరు వచ్చినా ఏడాది కూడా తాడిపత్రి బ్రాంచ్ కాలువ నీరు ఇవ్వడం ఏ మేరకు సాధ్యమన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఈ కాలువ ద్వారా ఒక వేళ నీటిని విడుదల చేసినా రోజుకు 1324 క్యూసెక్కుల ప్రకారం 18 టిఎంసిల నీరు ఇవ్వాలంటే ఐదు మాసాలకుపైగా సమయం పడుతుంది. అంత సమయం మిడ్ పెన్నార్ నుంచి ఇవ్వడం సాధ్యమవుతుందా అన్న అనుమానాలూ ఉన్నాయి. ఇప్పుడు నీటి సిస్టమ్‌ను అభివృద్ధి చేయకుండా నీటి కేటాయింపులు జరిపామని ప్రకటనలు చేయడాన్ని విపక్షాలు తప్పుబడుతున్నాయి.

చిత్తశుద్ధితో అమలు చేయాలి

జీవోలు ఇవ్వడం సాధ్యం .అసలు ఆచరణకు ఏ మేరకు సాధ్యమన్నది పరిశీలించాలి. ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని ఉత్తర్వులను కాగితాల్లో ఇచ్చినంత మాత్రాన ప్రయోజనం లేదు. అమలుకు సాధ్యమైన చర్యలను ముందుగా చేపట్టాలి. దానికి అనుగుణంగా ఉత్తర్వులిస్తే ప్రజలు నమ్ముతారు. లేకపోతే ఈ ప్రాంత ప్రజలను మరోమారు మభ్యపెట్టే ఉత్తర్వులు మాత్రమేనని భావించాలి. నియోజకవర్గంలో అత్యధికంగా సాగునీటిని అందించే దక్షిణ కాలువ ఆధునీకరణ పనులే ఇంత వరకు పూర్తి చేయలేదు. ఇప్పుడున్న సిస్టమ్‌లో 18 టిఎంసిలు ఏ రకంగా ఇస్తారో, ఎప్పటికిస్తారో కూడా ఎమ్మెల్యే వివరిస్తే బాగుంటుంది.

ఒ.నల్లప్ప
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

2024 మార్చి నాటికి లక్ష్యాలను పూర్తి చేస్తాం

గృహ నిర్మాణశాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లా లో 2024 మార్చి నాటికి ఇచ్చిన లక్ష్యాల మేరకు గృహ నిర్మాణాలు పూర్తి చేస్తామని గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జులై నెలలో ఐదు లక్షల ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిచేసి సామూహిక గృహప్రవేశాలు చేయించాలన్న లక్ష్యంగా గహ నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నవరత్నాలలో భాగంగా అందరికీఇళ్లు పథకం కింద గృహ నిర్మాణాలు చేపట్టింది. తరచూ వీడియో కాన్ఫరెన్స్‌ల్లో జిల్లా కలెక్టర్లతో గీహ నిర్మాణ పురోగతిపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఎక్కడికక్కడ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీ సత్యసాయి జిల్లా గృహ నిర్మాణాలపై ఆ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో ఆ జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిపై వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని లేఅవుట్లలో ఎన్ని గృహాలు మంజూరయ్యాయి?

జవాబు: జిల్లాలో మొత్తం 62,533 గృహాలు మంజూరు అయ్యాయి. 251 లేఅవుట్లలో గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

ప్ర : గృహ నిర్మాణాలు ఎన్నెన్ని ఏయే దశల్లో జరుగుతున్నాయి?

జ: బిలో బేస్మెంట్ లెవెల్ కింద 23,233, బేస్మెంట్ లెవెల్లో 16,472, రూఫ్‌లెవెల్‌లో 3,769, 1378 టాప్ లెవెల్‌లో ఉన్నాయి. 10,936 గృహ నిర్మాణాలు పూర్తి అయ్యాయి. ఇంకా ప్రారంభం కాని 6,465. వీటిలో వైఎస్ఆర్ అర్బన్ ఇళ్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాలకింద మంజూరైనవి ఉన్నాయి.

ప్ర : జూలై నెలలో సామూహిక గృహ ప్రవేశాల్లో జిల్లాలో ఎంత మంది చేరే అవకాశం ఉంది?

జ : రాష్ట్రవ్యాప్తంగా జూలై నెలలో ఐదు లక్షల ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు చేయించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. సత్యసాయి జిల్లా వరకు అయితే 15వేల ఇళ్లు పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేస్తున్నాం.

ప్ర : గహ నిర్మాణాలు ఎన్ని రకాలుగా కొనసాగుతున్నాయి?

జ : లబ్ధిదారులు ముందుకు వచ్చి ప్రభుత్వం ఇచ్చే సాయానికి తోడు చేతనైన కొంత మొత్తం భరించి మెరుగైన ఇల్లు నిర్మించుకోవడం అనుకునే వారు కొందరైతే, మరికొందరు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి నిర్మించాలనే వారు. ఈ రెండవ రకానికి చెందినవి హిందూపురం, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గంలో సుమారు 6వేల గృహాలు ఉన్నాయి వాటిని ప్రభుత్వం నిబంధన ప్రకారం నిర్మిస్తాం.

ప్ర : ఒక్కో ఇంటికి ప్రభుత్వం ఎంత మంజూరు చేస్తుంది?

జ : గ్రామీణ ప్రాంతాలైనా, అర్బన్ ప్రాంతాలైనా ఒక ఇంటికి రూ.1. 80 లక్షలను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. మరో రూ.35వేలు స్వయం సహాయక సంఘాల ద్వారా పావలా వడ్డీకి రుణం మంజూరు చేయబడుతుంది. దీని ప్రకారం మొత్తం రూ, 2 .15 లక్షలు మంజూరు అవుతుంది. ప్రభుత్వం కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది.

ప్ర : జిల్లాకు మంజూరైన మొత్తం గృహ నిర్మాణాలు ఎప్పటిలోగా పూర్తి అవుతాయి, లబ్ధిదారులకు మీరిచ్చే సూచనలేమిటి?

జ : జిల్లాకు మంజూరైన 62,253 ఇళ్లు 2024 నాటికి పూర్తి చేయాలనేది లక్ష్యం. ఆ లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు వచ్చి త్వరితగతిన ఇల్లు నిర్మించుకోవాలని, సొంతింటి కల నెరవేర్చుకోవాలని సూచిస్తున్నాం.

హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి

నిబంధనలకు అనుగుణంగా తరగతులు నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా పాఠశాలల్లో తరగతులు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో నేటి నుంచి 17వ తేదీ వరకూ ఒంటిపూట బడులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే కొన్ని ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు 8-30 నుంచి 4-30 వరకు పాఠశాలలు ఉంటాయని తల్లిదండ్రుల మొబైళ్లకు సక్షిప్త సమాచారం పంపిస్తున్నారన్నారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కొన్ని కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ధనార్జనే ధ్యేయంగా పాఠశాలలను నడుపుతున్నాయన్నారు. వీటికి కొందరు విద్యాశాఖ అధికారులు సైతం వత్తాసు పలుకుతూ విద్యను వ్యాపారంగా మార్చారన్నారు. అదేవిధంగా పెండింగ్ ఫీజులు కడితేనే పై తరగతులకు ప్రమోట్ చేస్తామని విద్యార్థులను ఇబ్బందులు గురి చేయడం మంచిది కాదన్నారు. అలాగే తరగతులు ప్రారంభం కాకముందే పాఠ్యపుస్తకాలకు డబ్బులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆయా పాఠశాలల యాజమాన్యాలు స్పందించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పాఠశాలలను నిర్వహించాలని, లేనిపక్షంలో ఆందోలనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అమ్మో... పశువుల దొంగలు



ప్రజాశక్తి పెద్దవడుగూరు

జీవనోపాధి కోసం యిష్టపడి పనిచేయడం కంటే దొంగతనం చేసి సునాయాసంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన కొందరి బద్ధకస్తుల్లో ఉంది. ఇలాంటి కొందరి ఆలోచన సమాజానికి ఇబ్బందిగా మారింది. అదేదో సామెత చెప్పినట్లు దొంగతనానికి బానిసైన వాడు దేనిని వదలడం లేదు. ఇంట్లో చొరబడి రాత్రివేళ ఇంటికి కన్నం వేసి దొంగతనాలు చేసే రోజులు పోయాయి.ఇంట్లో ఒంటరిగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని కొందరు అవసరమైతే దాడి చేసి ఇంట్లో నగలు, నగదు ఎత్తుకెళుతున్నారు. ఇటీవలి కాలంలో మహిళలు ఒంటరిగా వెళుతుంటే ద్విచక్ర వాహనాల్లో వచ్చి మెడలో గొలుసు లాక్కుని వేగంగా వాహనంలో ఉడాయించే దొంగలూ ఉన్నారు. అయితే వీటికి భిన్నంగా కొందరు దుండగులు పెద్దవడుగూరు మండలంలో సరికొత్త దొంగతనానికి తెరలేపారు. అదును చూసి రైతుల పశువులను ఎత్తుకెళుతున్నారు. ఇటీవల కాలంలో మండలంలో పశువుల దొంగల బెడద అధికమైంది. పశువుల ధరలు, పశుగ్రాసం ధరలు చూసి పశుపోషణ భారంగా భావించిన రైతన్నలు చాలాకాలంగా పశువుల పెంపకం పట్ల ఆసక్తి చూపడం లేదు. అంతేగాక పాడి కోసం, పేడ కోసం ఆవులకు బదులు గేదెలు పెంచుకుంటున్నారు. వ్యవసాయానికి పనికి వచ్చే ఎద్దుల పెంపకం పూర్తిగా తగ్గిపోయింది. వాటికి బదులుగా ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు ఉపయోగించడంతో పశువుల పెంపకంపై పెద్దగా ఆసక్తి లేకుండా పోయింది. కాగా అడపా దడపా పెంచుకున్న పశువులను పోషించుకుంటున్న యజమానులు తమ పశువులు కనిపించక పోవడంతో లబోదిబో మంటున్నారు.

ఆందోళనలో పాడిరైతులు

అన్నదాతలకు వ్యవసాయం ఎంతో ముఖ్యమో పాడి అభివృద్ధి అంతే ప్రధానం. అలాంటి పాడిపశువులను కొందరు దుండగులు మాయం చేస్తున్నారు. ఇక్కడి పాడిరైతులకు చెందిన పశువులను దొంగిలించి ఆర్థికంగా దెబ్బతిస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో వ్యవసాయం గిట్టుబాటు కాక, పాడిని నమ్ముకుని జీవించే రైతులు అధికంగా ఉన్నారు. పెద్దవడుగూరులో పదిరోజుల నుంచి దాదాపు వంద పశువులు దొంగలించబడ్డాయి. మండలంలోని చిన్నవడుగూరు, లక్షుంపల్లి, చిన్నవడుగూరు, మేడిమాకులపల్లి, కొట్టాలపల్లి, మిడుతూరు, పెద్దవడుగూరు గ్రామాలకు చెందిన పలువురు రైతుల పశువులను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రివేళల్లో ఎత్తుకెళ్లి మార్కెట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం వేసవికాలం అయినందున రైతులు పశువులను బయటకు వదిలిపెడతారు. ఇదే అదునుగా భావించిన కొందరు దుండగులు వాటిని లారీ, డీజిల్ ట్రాలీ ఆటో ఇతర వాహనాల్లో ఎక్కించుకుని వాటిని దూరంగా తరలిస్తున్నారు. బహిరంగ మార్కెట్లలో అమ్ముకుని అటునుంచి అటే పరారవుతున్నారు. పెద్దవడుగూరుకు చెందిన రామ రవికుమారు, నాగార్జున, గంగన్న, సూర్యనారాయణరెడ్డి, రాజు, ఓబిరెడ్డి, రంగనాయకులు, తదితరులకు చెందిన పశువులు పదిరోజులుగా కనిపించకుండా పోయాయి. ఎక్కడకు వెళ్లాయని ఆరాతీస్తున్నా ఎక్కడ ఉన్నది అంతుచిక్కడంలేదు. రోజు అడవికి వెళ్లిన పశువులు తిరిగి సాయంత్రానికి ఇంటికి వస్తాయి. తమ పశువులు ఇంటికి రాకపోవడంతో రైతులకు అనుమానం వచ్చి అన్ని చోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. మండలంలోకి దొంగలు ప్రవేశించి పశువులను టార్గెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. పశువులను ఎత్తుకెళ్లి అమ్ముకుంటే ఒక్కో గేదె ద్వారా రూ.10వేల నుంచి రూ. 50వేల దాకా ఆదాయం వస్తుందనే ఆశలతో దొంగలించుకు వెళ్తున్నారు. ఈ విషయంపై పోలీసులు స్పందించి మూగజీవాల దొంగలను పట్టుకుని రైతులకు న్యాయం చేయాల్సుంది.

ఖరీఫ్-22 పంటల బీమాను ప్రకటించాలి

17వ తేదీ నుంచి రైతుభరోసా కేంద్రాల వద్ద నిరసనలు
18 నుంచి తహశీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు
30న చలో విజయవాడ - ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఖరీఫ్ 2022లో అతివృష్టి, అనావృష్టి కారణాల దెబ్బతిన్న పంటలకు వెంటనే బీమాను ప్రకటించాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు అధ్యక్షతన ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా వేరుశనగ, పత్తి, మిరప, కంది వంటి పంటలు పొలాల్లోనే కుళ్లిపోయి మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులకు కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఖరీఫ్ 2022లో జిల్లాలో 2 లక్షల హెక్టార్లలో వేరుశెనగ, 70 వేల హెక్టార్లలో పత్తి, 20వేల హెక్టార్లలో మిరప పంటలు దెబ్బతిన్నాయన్నారు. అలాగే చీనీ, అరటి, దానిమ్మ, టమోటా ఇతర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అప్పట్లో రైతులు ఆందోళన చేస్తే స్పందించిన ప్రభుత్వం పంటల బీమా ద్వారా రైతులు ఆదుకుంటామని హామీ ఇచ్చి ఇప్పటి వరకూ ఇచ్చిన పాపానపోలేదన్నారు. ఖరీఫ్ రబీ-22 పంటల బీమాను రైతుల ఖాతాల్లో జమ చేయాలని, రైతు భరోసా కేంద్రాల్లో అన్నిరకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచి 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని, నాసిరకం, కల్తీ విత్తనాలను అరికట్టాలని, చీనీ, అరటి, నిమ్మ, మామిడి మార్కెట్లలో అమ్మకాల్లో జరిగే అక్రమాలు అరికట్టాలని, పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా అన్ని పంటలకు సి 2ప్లస్ 50శాతం ఫార్ములా ప్రకారం మద్దతు ధరలు ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, రాయలసీమకు నష్టం చేసే అప్పర్ భద్ర ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని, డ్రిప్, స్పింక్లర్లు దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ 90 శాతం సబ్సిడీతో జీఎస్టీ రద్దు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి జూన్ 17 నుంచి 19వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల వద్ద నిరసనలు తెలియజేయనున్నట్లు తెలిపారు. అలాగే 18 నుంచి 23వ తేదీ వరకు తహశీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు, 30న చలో విజయవాడ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, విటి.రామాంజినేయులు, విరుపాక్షి, రాజారామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, రాముడు, వెంకట్‌చౌదరి, సుంకన్న, చిదంబరమ్మ, నారాయణరెడ్డి, వెంకటకొండ కొండారెడ్డి, రమేష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపు అన్యాయం

సిపిఎం, కౌలు రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు పెంచి పేదల నడ్డి విరిచారని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య, సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్ విమర్శించారు. ఆదివారం ఉరవకొండలోని ఇందిరానగర్‌లో పర్యటించి విద్యుత్ బిల్లుల బాదుడుకు కుదేలవుతున్న పేదలను కలిసి ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా గతంలో చిన్న పెంకుటిల్లు కొట్టంలో నివాసమున్న వారికి నెలకు రూ.90 కరెంట్ బిల్లు వచ్చేదని, రూ.350 రావడంతో ఆందోళనకు గురికావడమే కాకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోయారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య, పేదలపై అన్ని రకాల ధరలు పెంచి వారి జీవితాలను బుగ్గిపాలు చేసే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద బడాబాబులకు పారిశ్రామికవేత్తలకు విద్యుత్తును సబ్సిడీ రూపంలో ఇస్తూ సామాన్య జనాంగంపై మాత్రం వారి నడ్డి విరిచే విధంగా నిబంధనలు పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరించడం ధరలు పెంచడం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇష్టానుసారంగా విద్యుత్ ఛార్జీలు పెంచి అధికారాన్ని పోగొట్టుకున్న విషయాన్ని అధికార పార్టీ గుర్తు చేసుకోవాలన్నారు. కేంద్రంలోని బిజెపి అధికారానికి సలాం కొడుతూ సిఎం జగన్ ఇష్టానుసారంగా విద్యుత్ ఛార్జీలను పెంచడం విరమించుకోవాలన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను కేటాయించడం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో కలిసివచ్చే ప్రజా సంఘాలను పార్టీలను కలుపుకుని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సీనప్ప, మురళి, రవికుమార్, ఇందిరానగర్ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో విద్యుత్ బిల్లుల వివరాలను తెలుసుకుంటున్న సిపిఎం, కౌలు రైతుసంఘం నాయకులు

వాల్మీకులపై నిర్లక్ష్య వైఖరి తగదు

వాల్మీకి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కులప్ప

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన వాల్మీకుల పట్ల రాజకీయ పార్టీలు, పాలకుల నిర్లక్ష్యం వైఖరి సరైంది కాదని వాల్మీకి/బోయ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండపల్లి అక్కులప్ప ఆవేదన వక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ అనాదిగా అగ్రకులాల పెత్తనం కారణంగా వాల్మీకులు అణచివేతకు గురువున్నారన్నారు. వాల్మీకులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న వివిధ రాజకీయ పార్టీల పెద్దలు ఆచరణలో మాత్రం అనగదొక్కే వైఖరినే అవలంభిస్తున్నారన్నారన్నారు. ఇందుకు ఉదాహరణ ఇటీవల ప్రారంభమైన టవర్‌క్లాక్ బ్రిడ్జి ప్రారంభ వేడుకలకు వాల్మీకి కులానికి చెందిన ఎంపీని పిలవకపోవమే అన్నారు. అలాగే జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పరిస్థితి కూడా ఇంచుమించుగా ఇలాంటి ధోరణే నడుస్తోందన్నారు. అగ్రవర్ణ నాయకులను ప్రశ్నిస్తే వాల్మీకుల గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జిల్లా రాజకీయాల్లో వాల్మీకి/బోయ కులస్తుల పాత్ర ఎంతో ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా అత్యధికంగా ఎనిమిది లక్షల మంది వాల్మీకులు ఉన్నారన్నారు. వారందరినీ తమ పబ్బం గడుపుకునే ప్రయత్నంలో రాజకీయ పార్టీలు సుదీర్ఘకాలంగా ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఓట్టి మాటలు చెప్పడం తప్ప ఆచరణ శూన్యమన్నారు. ప్రస్తుతం తాను టిడిపి సభ్యత్వానికి రాజీనామా చేశానని, ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా కేవలం వాల్మీకి ముద్దుబిడ్డగా వారి అభివృద్ధి కోసమే పని చేస్తానన్నారు. అలాగే వాల్మీకి ముద్దుబిడ్డ తలారి రంగయ్యను అవమానించిన ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో గద్దెదింపే వరకూ నిద్రపోమన్నారు. ఆయనతోపాటు వాల్మీకులను అవమానించే ఏ అగ్రకుల పాలకులైనా, పార్టీలకైనా తగిన బుద్ధి చెప్పేందుకు వాల్మీకులంతా ఏకమై అడుగులు వేస్తారని తెలిపారు.

కళాకారులను ప్రోత్సహించాలి

సరస్వతి కళానాట్యమండలి సభ్యులు

ప్రజాశక్తి-ఉరవకొండ

అంతరించిపోతున్న కళలు, కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలని మండలం సరస్వతి కళానాట్య మండలి సభ్యులు డిమాండ్ చేశారు. కళాకారుల యూనియన్ ఆధ్వర్యంలో ఉరవకొండ మండలం పెన్నోబిలంలో ఆదివారం కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల యూనియన్ నాయకులు రామసుబ్బారెడ్డి, వెలిగొండ నరసింహులు, వెంకటేశులు మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి నాటకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. దీనివల్ల ప్రజల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రజలకు అర్థమయ్యే రీతిలో నాటకాలు ఉంటాయన్నారు. అంతేకాకుండా ఆట పాటల ద్వారా ప్రజల్లో ఉత్సాహాన్ని నింపేందుకు నాటకాలు అవసరమన్నారు. నాటకాల్లో మంచి-చెడులను ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలియజేసే విధంగా కళాకారుల పాత్రలు ఉంటాయన్నారు. కళలు, కళాకారులను ప్రోత్సహించడమే కాకుండా కళాకారులకు ఇళ్ల స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, అర్హులైన ప్రతి కళాకారునికీ పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారుల యూనియన్ నాయకులతో పాటు దాదాపు 200 మంది కళాకారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సరస్వతి కళానాట్య మండలి సభ్యులు

In the Court of the Junior Civil Judge: Gooty
O.S.No.192/2022
Between:
C.Chinna Ankanna ...Plaintiff
And
C.Yogendranath ...Defendant
NOTICE TO DEFENDANT
To, C.Yogendranath S/o C.Ramappa R/of Kondupalli Village, Peddavaduguru Mandal, Ananthapuram Dist.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 14-06-2023వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
B.Jayarami Reddy
Advocate
Gooty, Cell:9440752284.

పది నెలల చిన్నారికి 'అమ్మ' చేయూత

అనంతపురం : స్థానిక 5వ రోడ్డులో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి అమ్మ సంస్థ వ్యవస్థాపకులు రమణారెడ్డి వైద్యం నిమిత్తం ఆర్థికసాయం అందించారు. కోవిడ్ సమయంలో నాజియా అనే గృహిణికి కరోనా సోకింది. ఆ సమయంలో గర్భంతో ఉన్న నాజియా అధికంగా మందులు వాడడం వల్ల కడుపులో బిడ్డకు నిమోనియా సోకి ఇబ్బందులు పడుతోంది. ప్రస్తుతం డెలివరీ అయిన తర్వాత ఆ బాబు వయసు 10 నెలలుగా ఉంది. అయితే ఇన్ఫెక్షన్ కారణంగా ప్రతినెలా ఆసుపత్రిలో అడ్మిట్ అవ్వాల్సిన పరిస్థితులు ఉన్నాయి. నిరుపేద కుటుంబం కావడంతో బతుకు భారమైన తల్లికి ఆసరా లేకపోవడంతో అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు రమణారెడ్డి తమవంతుగా రూ.15 వేల ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు. అలాగే ఇతర అవసరమైన వస్తువులను అందించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం : డి.హీరేహాల్ మండల కేంద్రంలో సోమవారం ఉదయం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నేడు సాయంత్రం నాలుగు గంటలకు ఇదే మండలంలోని జాజరకల్ గ్రామంలో కూడా పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు. కావున వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పవన్ యాత్ర విజయవంతం కావాలని పూజలు

పూజలు చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

ఉరవకొండ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టనున్న వారాహి యాత్ర విజయవంతం చేద్దామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉరవకొండలోని పార్కు అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో మార్పు, నూతన అధ్యాయ నిర్మాణం కోసం, ప్రజా సమస్యలపై బలమైన పోరాటం చేసేందుకు పవన్‌కళ్యాణ్ ఈనెల 14వ తేదీ నుంచి వారాహి యాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. కేవలం ఎన్నికల కోసమే చేసే యాత్ర కాదని, ప్రజల బాధలను ప్రత్యక్షంగా తెలుసుకోవడంతోపాటు సామాన్యులతో మమేకమై అయ్యేందుకు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు, బెలుగుప్ప, కూడేరు మండలాల అధ్యక్షులు చంద్రశేఖర్, గోపాల్, కేశవ, సుధీర్, నగేష్, నాయకులు దేవేంద్ర, రాజేష్, రమేష్, హరీశంకర్‌నాయక్, మల్లేష్‌గౌడ్, మల్లికార్జున, మణి, ప్రియతమ, రూపానాయక్, ఎర్రిస్వామి, సూర్యానాయక్, బోగేష్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

బహుమతి అందజేస్తున్న మాజీ జడ్పీటిసి

బుక్కరాయసముద్రం : ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విజేతలకు మాజీ జెడ్పిటిసి రామలింగారెడ్డి ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. అనంతం విన్నర్ జట్టుకు రూ.1.11 లక్షలు, రన్నరప్ జట్టుకు రూ.25వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, నాయకులు కేశన్న, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, బాబాయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు నిధులు రాబట్టడంలో పాలకులు విఫలం

పెద్దపప్పూరు : రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు రాబట్టడంతో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ చేపట్టిన రైతుగర్జన ప్రచార జాతా రెండోరోజు ఆదివారం పెద్దపప్పూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఒక్క రూపాయి కూడా ప్రాజెక్టులకు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా అప్పర్ భద్ర నిర్మాణంతో రాయలసీమ పూర్తిగా ఎడారిగా మారుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి రంగయ్య, శింగనమల నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్పయాదవ్, మండల సిపిఐ కార్యదర్శి చింతా పురుషోత్తం, వ్య.కా.సం నాయకులు రామేశ్వరరెడ్డి, నాయకులు రామకృష్ణ, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జనరల్ స్టోర్స్ నూతన కార్యవర్గం ఏర్పాటు

నూతనంగా ఏర్పాటైన కార్యవర్గ సభ్యులు

రాయదుర్గం : పట్టణ ఫ్యాన్సీ, జనరల్ స్టోర్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా జి.లోకేష్, ఉపాధ్యక్షులుగా అబ్బాస్, సెక్రటరీగా భీమరాజులు, కోశాధికారిగా భజంత్రీ హర్ష శివరాజ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నవీర, ప్రధాన కార్యదర్శి ఇస్మాయిల్, ధనార్జన, గోల్డ్ ఇస్మాయిల్, కంసల నాగరాజు, క్లాత్ అసోసియేషన్ సెక్రటరీ దండే విశ్వరాజ్, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి

మృతిచెందిన భరత్

గుత్తి : అభం శుభం తెలియని ఓ చిన్నారి ఆరుబయట ఆడుకుంటుండగా విద్యుత్ తీగ తగిలి మృత్యువాత పడిన ఘటన మండలంలోని కె.ఉబిచెర్ల గ్రామంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామచంద్ర, హరిత దంపతుల 3వ సంతానం భరత్ (2) ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా విద్యుత్ స్తంభానికి సంబంధించిన వైరు తగలడంతో విద్యుత్‌ఘాతానికి గురై మరణించాడు. చిన్నారి మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మరో ప్రమాదంలో రైతుకు గాయాలు

చికిత్స పొందుతున్న ఆదినారాయణరెడ్డి

గుత్తి : మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో ఓ రైతుకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డి తన తోట వద్ద విద్యుత్ వైరు కింద పడి ఉండడంతో కర్రతో పక్కకు తొలగిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గాయపడ్డ రైతును స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఆసుపత్రిలో క్షతగాత్రున్ని ఏపీఎస్పీడీసీఎల్ ఎఇ శ్రీకుమార్, వైసిపి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామరంగారెడ్డి పరామర్శించారు.

బంగారుచైను చోరీ

శింగనమల : మండల పరిధిలోని మరువకొమ్మ సమీపంలోని ఓ తోట వద్ద నల్లరేగడి కాయలు అమ్ముకుంటున్న మహిళ మెడలోని బంగారు చైన్‌ను గుర్తు తెలియని దుండగుడు అపహరించాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని చక్రాయపేట పంచాయతీ శివపురం గ్రామానికి చెందిన రొద్దం నారాయణరెడ్డి భార్య నాగరత్నమ్మ రోజూ సమీపంలోని తోట వద్ద నల్లరేగడి కాయలు విక్రయిస్తూ ఉండేది. ఇందులో భాగంగానే ఆదివారం కూడా కాయలు అమ్ముకుంటుండగా గుర్తుతెలియని వ్యక్తి మధ్యాహ్నం 12 గంటల సమయంలో రేగడికాయలు అడిగాడు. దీంతో నాగరత్నమ్మ రేగడికాయలను తూకం వేస్తుండగా ఒక్కసారిగా మెడలోని బంగారు తాళిబొట్టు చైన్‌ను లాక్కొని వెళ్లినట్లు బాధితురాలు వాపోయింది. వెంటనే లబోదిబోమంటూ శింగనమలకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పేకాటజూదరుల అరెస్టు

యాడికి : పట్టణ శివారులో గుట్టుగా పేకాట ఆడుతున్న 9 మందిని పట్టుకున్నట్లు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నిందితులను అరెస్టు చేయడంతోపాటు రూ. 20,600 నగదు, 8 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పలువురు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

బత్తలపల్లి : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్న ఆశయంతో ఆర్‌డిటి వేలాది మందికి కార్పొరేట్ కళాశాల్లో ఉన్నత చదువులకు చేయూతనందిస్తోందని ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహన్ మురళి పేర్కొన్నారు. ఆర్‌డిటి సెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆదివారం ఆర్‌డిటి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మోహన్‌మురళి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ రెండుళ్లు, బి.టెక్ నాలుగేళ్లు ఆయా కళాశాలల్లో విద్యకయ్యే ఖర్చును ఆర్‌డిటి భరిస్తుందన్నారు. అనంతపురం, కర్నూలు, విజయవాడ, తిరుపతి పట్టణాల్లో ఎంపిక చేసుకున్న కళాశాలలో విద్యనభ్యసించవచ్చు అన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలనే ఆశయంతో ఆర్‌డిటి స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం-2004లో ప్రారంభమైందన్నారు. ఈ ప్రోగ్రాం ద్వారా వేలాది పేద కుటుంబాలు ఉన్నతిని సాధించాయన్నారు. ఈ సంవత్సరం బత్తలపల్లి రీజియన్‌లో 461 మంది ఆర్‌డిటి సెట్ రాయగా 68 మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బత్తలపల్లి రీజినల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్‌లు రుక్మాంగధ, రఘురాం, సంజీవరెడ్డి, శ్రీనివాసులు, ఎస్‌టిఎల్స్ రామకృష్ణ, సురేంద్ర, రామాంజనేయులు, రాజేంద్ర, సిఓలు వెంకటేష్, సురేష్, చిత్రసేన, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని రీసోర్స్‌పర్సన్ శ్రీనివాస్, శాలినీ అన్నారు. గ్రంథాలయాధికారి వై.ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో 35 రోజులపాటు ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానం నిల్వ ఉన్న దేవాలయాలు అన్నారు. కావున విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లి జ్ఞానాన్ని సముపార్జించుకుని ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరాల్లో నిర్వహించిన కథలు చెప్పడం, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో 35 రోజులు పాటు జరిగిన వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారం ముగిశాయి. గ్రంథాలయాధికారి హెచ్.రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జెన్నే కుళ్లాయిబాబు, విశ్రాంత గ్రంథాలయాధికారి ఏసీ సుబ్బన్న, ఉపాధ్యాయుడు టి. నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

బుక్కరాయసముద్రం : సెల్‌ఫోన్లు పక్కన పెట్టి పుస్తకం చేయి పట్టాలని గ్రంథాలయ అధికారి పొన్నం విజయభాస్కర్ పిలుపునిచ్చారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా దాదాపు 35 రోజుల పాటు విద్యార్థిని హాజరై కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, కథలు చెప్పుట, ఆటలు, క్యారంబోర్డు, చెస్, పాముపటం, యోగా, డాన్స్ వంటి వాటిలో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయ అధికారి సత్యనారాయణ, ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసినస వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపిపి హేమలత మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి నల్లమ్మ, సిబ్బంది, ఆడిట్ టీచర్ పెద్దన్న, సరళ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మే 8వ తేదీ నుంచి ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కె.జీవన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో విశ్రాంత కండెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ 'చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. ఒక మంచి పుస్తకం కొనుక్కో' అని పెద్దలు చెప్పిన విధంగా చదవడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 35రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భూమిరెడ్డి ట్రస్టు సభ్యుడు పెదనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో పిల్లలు సెల్‌ఫోన్లు, ఫేసుబుక్, వాట్సాప్, వీడియో గేమ్స్ వంటి వాటిపై ఎక్కువ శ్రద్ధ చూపుతూ సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. కావున విద్యార్థులను సెల్‌ఫోన్లవైపు కాకుండా గ్రంథాలయం వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జయరాముడు, రీసోర్స్‌పర్సన్ అనిత, విద్యార్థులు, పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 35 రోజులపాటు ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైసిపి వైస్ సర్పంచి పి.లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణ, రంగన్న, విద్యార్థులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం, గుత్తిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు